క్లుప్తంగా

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదు

హుడాకాంప్లెక్స్: ఎమ్మెల్యే సబితారెడ్డిని విమర్శించే స్థాయి బేర బాలకిషన్‌కు లేదని బీఆర్‌ఎస్ పార్టీ సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఆకుల అరవింద్‌కుమార్ అన్నారు. బాలకిషన్ ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను ఆదివారం ఆయన ఖండించారు. అనంతరం మాట్లాడారు. డివిజన్ ప్రజలను కడుపులో పెట్టుకుని చూసే సబితారెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదని, స్థాయి మరిచి మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అంకిరెడ్డి, కొండల్‌రెడ్డి, అరవింద్, సుదామా, పి.రాజు, రిషీ, కొండ గిరిగౌడ్, రాజేష్, ప్రత్యూష్, జహీర్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయం 28వ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులకు వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య అభిషేకాలు నిర్వహించారు. అలాగే, శ్రీ జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని నిర్వహించారు. ఆలయంలో శ్రీ లక్ష్మీ నారాయాణ కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ స్వామికి సూర్యప్రభ వాహన సేవ, అశ్వవాహన సేవ, దీపోత్సవం నిర్వహించారు. పూజల్లో టీటీడీ బోర్డు మెంబర్ గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి సీతా రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయ్యిత అంజయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో) టమాటా 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాబేజీ 18, ఫ్రెంచి బీన్స్ 95, క్యారెట్ 35, దొండ 28, చిక్కుడు 55, గోకర 28, బీట్‌రూట్ 25, క్యాప్సికం 47, ఆలు 33, దోస 18, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 25, చామగడ్డ 50. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సేవాలాల్ మహరాజ్ గొప్ప మార్గదర్శకుడు

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ సమాజానికి గొప్ప మార్గదర్శకుడని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లాపూర్ గుడితండాలో ఆదివారం నిర్వహించిన సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం, దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా స్థానిక గిరిజన నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎంపీపీతో పాటు నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్‌నాయక్, రవి నాయక్, దయానంద్‌గుప్తా, దశరథ్‌నాయక్, నర్సింహారెడ్డి, మోదీ దర్శన్, మల్లేశ్, జయేందర్‌రెడ్డి, శ్రీరాములు, రాజుగౌడ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మొయినాబాద్: ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పరిశీలించారు. మండలంలోని నాగిరెడ్డిగూడ, చిలుకూరు, చందానగర్, పెద్దమంగళారం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన యూత్ మోడల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: స్నేహితుడి అకాల మరణంతో స్పందించిన పూర్వ విద్యార్థులు.. అతడి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేసి ఉదారతను చాటుకున్నారు. మండల పరిధి తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బండి యాదగిరి గౌడ్ శనివారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న మృతుడి బాల్య మిత్రులందరూ.. యాదగిరి కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందజేశారు. మిత్రుడి మరణం తమను తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఘనంగా రామానుజ జయంతి

కొడంగల్: పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రామానుజ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. అర్చకులు ఆలయ ప్రదక్షిణ చేసి పట్టు వస్త్రాలు, పూలమాలలు రామానుజ జీయర్‌స్వామి మూలమూర్తికి సమర్పించి, విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఓట్ల పండుగకు సర్వం సిద్ధం



మహేశ్వరం: ఓటింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బయల్దేరిన సిబ్బంది



కందుకూరు: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది

నేడు లోక్‌సభ ఎన్నికలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మహేశ్వరం: పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం అయింది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకే వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది చేరుకున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం మహేశ్వరం నియోజకవర్గంలో 537 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. వాటిల్లో పీఓలు–537, ఏపీఓలు–537, ఓపీఓలు–1074, వెబ్ కాస్టింగ్–537, మైక్రో అబ్జర్వర్స్–26 సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. 56,741 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి సుమారు 8 మంది సిబ్బందిని నియమించినట్లు ఏఆర్‌ఓ సూరజ్ కుమార్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల గంట వరకు పోలింగ్ జరగనుందని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రజలు గుమికూడ వద్దని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు.



మహేశ్వరం: కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

ఎన్నికల సామగ్రితో సిబ్బంది

కందుకూరు: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో.. ఎన్నికల సిబ్బంది.. ఈవీఎంలు తదితర ఓటింగ్ సామగ్రితో వారికి కేటాయించిన గ్రామాలకు చేరుకున్నారు. మండల పరిధి 35 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన 61 పోలింగ్ బూత్‌ల్లో.. 50,437 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక్కో బూత్‌లో నలుగురు చొప్పున 244 మంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. అర్హులందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.

భారీగా బందోబస్తు

పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ మక్బుల్‌జానీ తెలిపారు. ఇద్దరు ఎస్‌ఐలు, 60 మంది కానిస్టేబుళ్లు, తమిళనాడుకు చెందిన ఒక క్విక్ రియాక్షన్ బృందం, మరో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ పహారా కాయనుందని పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా సాగేలా ప్రజలు సహకరించాలని, ఏదైనా అత్యవసరమైతే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు.



మహేశ్వరం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సామగ్రితో బయలుదేరిన సిబ్బంది



ఎన్నికల విధుల కోసం బస్సులో బయలుదేరిన సిబ్బంది

పూర్తి కావచ్చిన బ్రిడ్జి పనులు



రాంనుంతల–పెద్దతండా మధ్య నిర్మించిన బ్రిడ్జి

- రాంనుంతల, పెద్ద తండాల మధ్య నిర్మాణం
- రూ. 1.10 కోట్లతో పనులు
- తీరనున్న గిరిజనుల ఇబ్బందులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామం నుంచి పెద్ద తండా మధ్యలో వాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. సుమారు రెండు, మూడు దశాబ్దాలుగా బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న గిరిజనుల కల త్వరలో నెరవేరనుంది. వంతెన అసంపూర్తి పనుల కోసం మరో రూ. 20 లక్షలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అదనపు నిధులు మంజూరైతే మిగిలిన పనులు పూర్తి చేసి బ్రిడ్జిని అందుబాటులోకి తేనున్నారు.దీంతో గిరిజనుల ఇబ్బందులు తీరనున్నా యి.

వాగు పారితే రాకపోకలు బంద్..

రాంనుంతల గ్రామం నుంచి పెద్దతండా మధ్యలో వర్షాకాలంలో వాగు ప్రవహిస్తుంటుంది. కాలువ పారే సమయంలో రాంనుంతల, పెద్దతండాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే కోనాపూర్ మీదుగా వెళ్లాల్సి వస్తుంది. ఈ వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా గిరిజనులు కోరుతున్నారు. గతంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న రాంనుంతల గేటు నుంచి చిన్నతండా, పెద్దతండాల మీదుగా రాంనుంతల వరకు బీటీరోడ్డు నిర్మాణంతో పాటు బ్రిడ్జి నిర్మించాలని ఎప్పటినుంచో కోరుతున్నారు. గత ఐదేళ్ల క్రితం రూ.1.10 కోట్లు మంజూరు కాగా కేవలం బీటీరోడ్డు నిర్మించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు.

పూర్తి చేయించాలి



రాంనుంతల–పెద్దతండాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలి. మిగిలిన పనులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలి. బ్రిడ్జి నిర్మాణం కోసం గిరిజనులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలి.

–శ్రీనునాయక్, రాంనుంతల

నిధులు మంజూరు...

రాంనుంతల–పెద్దతండాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.10 కోట్లు ఎఫ్‌డీఆర్ నిధుల కింద ప్రభుత్వం గత ఏడాది నిధులను మంజూరు చేసింది. దీంతో అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేశారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ.. ఇరువైపులా సీసీ రోడ్డు, రివిట్‌మెంట్ తదితర పనులు చేయడానికి నిధులు లేకపోవడంతో పనులు ఆగిపోయాయి. అసంపూర్తి పనులకు గాను రూ.20లక్షలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరైతే వెంటనే పనులు పూర్తిచేసి బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు.

ఉషా గాయత్రికి ఆత్మీయ సత్కారం



నాట్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

నాంపల్లి: సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో యువ కళావాహిని నిర్వహణలో ప్రముఖ కూచిపూడి నృత్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆత్మీయ సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణ హాజయ్యారు. దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ హైదరాబాద్ డాక్టర్ పాలకుర్తి మధుసూదనరావు హాజరై సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, సినీ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, కూచిపూడి నాట్య గురువు డాక్టర్ ఎస్.పి.భారతి, యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, కిన్నెర రఘురామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి దంపతులను సత్కరించారు. సభా ప్రారంభంలో డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి శిష్య బృందంచే ప్రదర్శించిన భజ గోవిందం సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తా

- ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా

కవాడిగూడ: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కృషి చేస్తున్నదని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జోన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఐవీఎఫ్ సెంట్రల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తాలు వారిచే ప్రమాణ స్వీకరాం చేయించారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ... ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు అన్ని రంగాలలో రాణించేలా ఐవీఎఫ్ కృషిచేస్తున్నదన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ఐవీఎఫ్ యువజన కమిటీ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన ఆర్యవైశ్య పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేందుకు ఆర్థిక సాయం అందించడంతోపాటు బాలబాలికలకు ఉచితంగా వసతి గృహాలను సైతం ఏర్పాటు చేసిందన్నారు. పుణ్య క్షేత్రాల వద్ద వసతి గృహాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేస్తున్నదన్నారు. పేద కుటుంబాలకు చెందిన ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ కమిటీ సలహాదారుడు సత్తయ్య, కోశాధికారి నారాయణ, అడిషనల్ సెక్రటరీ శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ, యువజన కమిటీ అధ్యక్షుడు రవిందర్, మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి మంజుల తదితరులు పాల్గొన్నారు.



కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాజమౌళిగుప్తా, శ్రీనివాస్‌గుప్తా

సీతారామాంజనేయ దేవాలయంలో పూజలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవలయంలో, గణపతి, సుబ్రహ్మణ్య శివ, నంది, సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలు, గజస్తంభం, శిఖరాలు ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆలయంలో మండల పూజ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య హోమం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటయ్య, కార్యదర్శి బత్తుల బాల కుమార్ గౌడ్, నరసింహ రెడ్డి, నాగేశ్వర్, రాకేశ్, తిరుపతిరెడ్డి, వెంకట్ రెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కసిరెడ్డి నారాయణరెడ్డికి పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి శనివారం రాత్రి విచ్చేసిన భట్టి విక్రమార్క ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎమ్మెల్యే కసిరెడ్డితో ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ యాదయ్య ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువ ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ముస్తాబు



అజీజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం

మొయినాబాద్‌రూరల్: మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎత్‌మార్‌పల్లి గ్రామాల్లో అధికారులు యువ ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసి ముస్తాబు చేశారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లను ఆకర్షించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద స్వాగత బోర్డులతో పాటు పచ్చని మామిడి తోరణాలు, పూలమాలలు వేసి బెలూన్లతో ఓటర్లను ఆకర్షించే విధంగా ముస్తాబు చేశారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో పంచాయతీ కార్యదర్శి రంజిత్ కుమార్, హిమాయత్‌నగర్‌లో సంధ్య, ఎత్‌మార్‌పల్లిలో శివ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలను ఓటర్లు ఆకర్షించే విధంగా తయారుచేశారు. అధికారుల సూచనల మేరకు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

తాయిలాలు.. ప్రలోభాలు.. బుజ్జగింపులు!

జోరుగా మద్యం, నగదు పంపిణీ

- ఇవీ ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎన్నికల సిత్రాలు



చంపాపేట: ''హలో...కాకా ఎక్కడున్నవే.. పిన్నమ్మ, పిల్లలు ఇంటికాడనే ఉన్నరా? మొత్తం ఆరు ఓట్లుగదనే.. నువ్వు జల్దీగా గాంధీ బొమ్మ కాడికిరా. మీ ఓట్ల బాధ్యత పటేలు నా మీదనే పెట్టాడు''.

◆ ''అత్తమ్మ బాగున్నావా... మీ మంచి, చెడు నేను చూసుకుంటా గానీ.. ఈసారి మా పార్టీ గుర్తుపైనే అందరూ ఓటు వేయాలి. మనందరం ఒకటే కదనే.. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా నేను మీలో ఒకడిని కదనే... పోయిన ఎన్నికల్లో లాగా చేయకండి'' అని పార్టీల ఇన్‌ఛార్జిల బుజ్జగింపులు.

◆ '' పక్క గల్లీలో యాట, మందు మస్తుగ ఇస్తిరంట గదా.. వారు మస్తు దావత్ చేసుకుంటున్నరు. మీ కంటికి మేము కనిపించటంలేదా? అని ఓ కాలనీ వాసుల ఆవేదన. మా ఓట్లు మీకొద్దా? ఆ పార్టీ ఓడు ఇచ్చినంతనే మీరు ఇస్తిరి. ఎవరికి ఓటు వేయాలి? అంతకంటే ఎక్కువ ఇయ్యిర్రి అప్పుడే మీకేస్తాం'' అంటూ.. కాలనీల ఓటర్లు నాయకులను నిలదీత.

◆ ఇవీ ఎన్నికల ప్రచారం ముగింపు తర్వాత ఎల్‌బీనగర్‌లోని ప్రతి డివిజన్లలో ఓట్లు రాబట్టేందుకు పార్టీ నాయకుల ఆత్మీయ పలకరింపులు, బుజ్జగింపులు, ప్రలోభాలు. మరి కొంత మంది నాయకులు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో కులం, మతం, యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధుల ఓటు సరళిపై అంచనా వేస్తూ వారందరి ఓట్లు తమకే పడతాయని పార్టీ అధిష్టానికి సమాచారం అందిస్తూ వారి ఆశీస్సులు పొందేందుకు యత్నిస్తున్నారు. మరి కొంతమంది నాయకులు డబ్బు, మద్యం పంచేందుకు కాలనీకి చేరి, పోలీసులు వస్తున్నారని భూటకపు హంగామా సృష్టించి ఇదంతా ఇతర పార్టీ నాయకులు ఫిర్యాదే కారణమంటూ అక్కడినుంచి పలాయనం చిత్తగించే సీన్లు రిపీటెడ్‌గా జరుగుతుండటంతో ఓటర్లు ముక్కున వేలు వేసుకుంటున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

- ప్రతి ఒక్కరూ ఓటెయ్యాలని గుడిలో పోస్టర్ల ఏర్పాటు

సైదాబాద్: సైదాబాద్‌లోని మాతామైదాన్‌లో కొలువుదీరిన శ్రీవిజయదుర్గ ఆలయం 19వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు పలు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి పూజల్లో సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధి అర్థం సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శం చాటుకున్న నిర్వాహకులు..

అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో కమిటీ ప్రతినిధులు ఆదర్శం చాటుకున్నారు. భక్తులు అందరూ సోమవారం తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని వారు ఆలయ ఆవరణలో పోస్టర్లు ఏర్పాటు చేశారు. దైవభక్తి ఎంత ముఖ్యమో దేశభక్తి కూడా అంతే ముఖ్యమని, అందుచేత భక్తులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొని ఓటు వేయాలని ఆ పోస్టర్లలో అందరికీ విజ్ఞప్తి చేశారు.



భక్తులు ఓటెయ్యాలంటూ ఆలయంలో ఏర్పాటు చేసిన పోస్టర్

సంప్రదాయ సంగీతాన్ని భావితరాలకు అందించాలి

చిక్కడపల్లి: సంస్కృతికి ప్రధానమైన సంప్రదాయ సంగీతాన్ని పరిరక్షిస్తు భావితరాలకు అందించాల్సిన బాధ్యత గురువులు, తల్లిదండ్రులుపై ఉందని వివిధ రంగాల ప్రముఖులు కోరారు. ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో శాస్త్రీయ సంగీత గురువు చిల్ల శివ పార్వతి జన్మదిన సందర్భంగా ఆమె శిష్య బందం గానం, నాట్య గురువు జ్యోతి శేఖర్ శిష్యురాలు గాయత్రి శేఖర్ కూచిపూడి నాట్య ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథిగా కళా పోషకుడు గుదిబండి వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. శివ పార్వతి ఎందరో ఔత్సాహికులకు సంప్రదాయ సంగీత నేర్పిస్తూ వారిని ఉత్తమ గాయకులుగా సమాజానికి అందిస్తున్నారని అభినందించారు. శ్రీ రామసాంస్కతిక సంస్థ స్థాపకుడు గొర్తి చంద్రశేఖర్, ప్రముఖ గాయకుడు త్రినాథరావు, శేఖర్‌లను అభినయ నాట్య మంజరి బిరుదుతో సత్కరించారు.